క్లుప్తంగా

ముగిసిన పదోతరగతి పరీక్షలు



పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం: పదోతరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. దీంతో కేంద్రాల వద్ద సందడి నెలకొంది. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల కోసం కేంద్రాల వద్ద మండుటెండలో వేచి ఉన్నారు. పరీక్ష పూర్తవగానే బయటకు వచ్చిన విద్యార్థుల వద్దకు తల్లిదండ్రులు వచ్చి పరీక్ష రాసిన తీరుతెన్నులు గురించి తెలుసుకున్నారు. మరో వైపు పరీక్షలు ముగియడంతో విద్యార్థుల ముఖాల్లో సంతోషం కనిపించింది. గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల, బాలుర ఉన్నత పాఠశాలల్లో కేరింతలతో విద్యార్థులు సందడి చేశారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగావకాశాలు

మురళీనగర్: పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ విద్యను అభ్యసించడం వల్ల తక్షణ ఉద్యోగావకాశాలు లభిస్తాయని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. కాలేజీ సమీపంలోని శ్రీశాంతి నికేతన్ ఉన్నత పాఠశాలలో సాంకేతిక విద్యపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. పాలిటెక్నిక్ విద్యను అభ్యసించి 18 ఏళ్లు దాటిన విద్యార్థులకు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో మంచి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. బీటెక్‌లో నేరుగా రెండో సంవత్సరంలో చేరి ఉన్నత విద్యను కొనసాగించుకోవచ్చన్నారు. కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో చేరిన విద్యార్థులు నూరు శాతం క్యాంపస్ ఉద్యోగాలు సాధించిన విషయాన్ని ఆయన వివరించారు. పాలిసెట్‌కు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నామన్నారు.

బాబోయ్ భౌ





వీధి కుక్కల దాడిలో గాయపడిన నేవీ ఉద్యోగి

వాహనాలపై వెళ్తున్న వారినీ వదలని వైనం

వీధుల్లో తిరిగే వారినే కాకుండా ద్విచక్రవాహనాలపై వెళ్తున్న వారిని **కుక్కలు వెంబడించడంతో వాహనదారులు** ప్రమాదాలకు గురైన సందర్భాలు **ఉన్నాయి. వీధికుక్కల నియంత్రణ కోసం** సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు **మొరపెట్టుకున్నా ఫలితం ఉండడం లేదని** ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



63వ వార్డులో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు



40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలోని క్రీడామైదానంలో..

సింధియా: జీవీఎంసీ 40, 62, 63వ వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధికుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. వీధుల్లో విచ్చల విడిగా సంచరిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. మూకుమ్మడిగా దాడి చేయడంతో రోడ్లపైకి రావాలంటే చిన్నపిల్లల తల్లిదండ్రులు, వృద్ధులు భయపడుతున్నారు.

ఇదీ పరిస్థితి

ఏకేసీకాలనీ, చింతల్లోవ, క్రాంతినగర్, జయేంద్రకాలనీ, త్రినాథపురం, దుర్గానగర్, గుడివాడఅప్పన్నకాలనీ, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే హడలెత్తిపోతున్నారు.

నెల	కుక్కకాటు బాధితులు
జనవరి	15 మంది
ఫిబ్రవరి	12 మంది
మార్చి	13 మంది

కుక్కకాటుకు గురైన బాధితులు శ్రీహరిపురం, గుల్లలపాలెం ప్రభుత్వాస్పత్రులు, క్రాంతినగర్ యూపీహెచ్‌సీ, 40వ వార్డు ఏకేసీకాలనీలోని యూపీహెచ్‌సీలో చికిత్స పొందారు. ఒక్క ప్రభుత్వాస్పత్రుల్లోనే కుక్కకాటుకు గురైన వారి సంఖ్య ఈ స్థాయిలో ఉంటే ఇక ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లిన వారి సంఖ్య ఎంత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

అందుబాటులో రేబిస్ వ్యాక్సిన్

వీధి కుక్కల దాడితో గాయపడిన వారికి వెంటనే రేబిస్ వ్యాక్సిన్ వేయడం వల్ల కొంతవరకు ప్రమాదాన్ని అరికట్టవచ్చు. దీంతో ప్రభుత్వమే ఆసుపత్రులకు రేబిస్ వ్యాక్సిన్ సరఫరా చేస్తుంది. జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలోని యూపీహెచ్‌సీలో సుమారు 40 రేబిస్ వ్యాక్సిన్లు, 63వ వార్డు క్రాంతినగర్ యూపీహెచ్‌సీలో 50, గుల్లలపాలెం ప్రభుత్వాస్పత్రిలో 120 వరకు రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.

నియంత్రణ లేకపోవడం వల్లే అనర్థాలు

పారిశ్రామిక ప్రాంతంలో వీధి కుక్కల నియంత్రణపై అధికారులు దృష్టి సారించకపోవడం వల్లే అనర్థాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వీధి కుక్కలను గుర్తించి వాటిని డాగ్ క్యాచర్స్ ద్వారా ఆధీనంలోకి తీసుకుని మగ కుక్కలకు వేసెక్టమి ఆపరేషన్లు చేయించాలని కోరుతున్నారు. అయితే ఖర్చుతో కూడుకున్న పని కావడం, పైగా కుక్కలను తీసుకువచ్చి ఆపరేషన్‌కు ముందు వారం రోజులు, ఆపరేషన్ తర్వాత వారం రోజులు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉండడంతో చేతులెత్తేసి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

కొరవడిన సమన్వయం

ఇక పశుసంవర్ధక శాఖ అధికారులు వీధికుక్కల నియంత్రణ తమ పనికాదని, జీవీఎంసీ పట్టింపు లేకపోవడంతో వీధికుక్కల నియంత్రణ మాకెందుకులే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. పట్టించుకోకవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బయటకు వెళ్లాలంటే భయం



మా ప్రాంతంలో వీధి కుక్కలు చాలా ఎక్కువగా ఉన్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా గుంపులు గుంపులుగా తిరుగుతూ మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి. ఇటీవల మా వీధిలో ఒక మహిళ వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెంబడించి మరీ ఆమె కాలిని గాయపరిచాయి. అప్పటి నుంచి బయటకు రావాలంటే భయమేస్తోంది. అధికారులు చర్యలు చేపట్టాలి.

– **రమణయ్య**, ప్రకాష్‌నగర్, 62వ వార్డు

వీధి కుక్కలను నియంత్రించాలి



వీధి కుక్కల దాడులు అధికమవుతున్నాయి. అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. ఎక్కడి నుంచో కుక్కలను తీసుకువచ్చి మా ప్రాంతాల్లో వదిలేస్తున్నారు. దీంతో ఆ కుక్కలు చిన్నపిల్లలు వీధుల్లోకి రాగానే వెంబడించి గాయపరుస్తున్నాయి. వాహనదారులను వెంబడించడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులకు విన్నవించిన వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవడంలేదు.

– **లక్ష్మి**, 40వ వార్డు

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు అండగా వైఎస్సార్‌టీయూసీ



దీక్షకు మద్దతుగా నిలిచిన వైఎస్సార్‌టీయూసీ నాయకులు

మల్కాపురం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాయపురెడ్డి అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ.. ఈ అంశంపై కేంద్రాన్ని ప్రశ్నించని కూటమి నాయకులకు వ్యతిరేకంగా అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో నగరంలో గాంధీ విగ్రహం వద్ద మంగళవారం చేపట్టిన మహాదీక్షలో పారిశ్రామిక ప్రాంత వైఎస్సార్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు. దీక్షకు మద్దతు తెలిపారు. ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాయపురెడ్డి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో 60వ వార్డు పరిధి గుల్లలపాలెం నుంచి ప్లకార్డులతో ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వెళ్లారు.

పార్లుపాలెంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతదేహం

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పార్లుపాలెం రైల్వే ట్రాక్ సమీపంలోని వేపాడమ్మతల్లి ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. దీనిపై పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ అసిరితాత సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి 35–40 ఏళ్ల వయసు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు జరుగుతోంది.

డిజిటలైజేషన్‌తోనే అభివృద్ధి సాధ్యం



ప్రిన్సిపల్ నరసింహారావును సత్కరిస్తున్న ఆచార్య స్టీఫెన్

విశాఖ విద్య: డిజిటలైజేషన్‌తోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ అన్నారు. వర్సిటీలోని అంబేడ్కర్ చైర్‌లో రెండు వారాల పాటు నిర్వహించిన ఐసీఎస్ఎస్ఆర్ స్పాన్సర్డ్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంను మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ఆచార్య నరసింహారావు ప్రారంభించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులతో పాటు, రీసెర్చ్ స్కాలర్స్‌కు సైతం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ ఈ నెల 14 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అన్ని రంగాల్లోనూ డిజిటలైజేషన్ పాత్ర గణనీయంగా పెరిగిందన్నారు. ఆచార్య ఎం. రాంజీ , ఆచార్య గోవాడ వీర్రాజు పలు అంశాలను వివరించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. లక్ష కుంకుమార్చన ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మాయా సుందర రాజన్

విశాఖ విద్య: అమెరికాలో ఉన్నత విద్య, పరిశోధనలకు అందించే వివిధ స్కాలర్‌షిప్‌లను భారతీయ యువత సద్వినియోగం చేసుకోవాలని యునైటెడ్ స్టేట్స్ ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చెన్నై రీజినల్ ఆఫీసర్ మాయా సుందర రాజన్ అన్నారు. మంగళవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల పరిధిలో ఫుల్‌బ్రైట్ నెహ్రూ స్కాలర్‌షిప్‌తో పాటు వివిధ స్కాలర్‌షిప్‌లపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్‌లపై విస్తృత అవగాహన కల్పించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంతో ఉన్నత విద్య సంబంధాలను మరింత బలోపేతం చేసే విధంగా ఈ స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్ 1946లో ప్రారంభమైందని, ప్రస్తుతం 160 దేశాల్లో ఇది అమలవుతుందని చెప్పారు. ఇప్పటివరకు నాలుగు లక్షల మందికి ఈ స్కాలర్‌షిప్ ద్వారా అమెరికాలో ఉన్నత విద్యను పొందే అవకాశాన్ని పొందారని చెప్పారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్. రాజు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్య, పరిశోధన జరపడానికి ఎంతో ఉపయోగకరంగా స్కాలర్‌షిప్‌లు నిలుస్తాయని చెప్పారు. ఈ స్కాలర్‌షిప్‌లు సాధించిన వారు విదేశాల్లో పొందే వివిధ సదుపాయాలు, అవకాశాలు తెలియజేశారు. ఏ దేశంలో పరిశోధన చేయాలి అనే అంశంపై నిర్దిష్టమైన అవగాహనతో ఉండాలని సూచించారు.

ఘనంగా ఉత్కళ్ దివస్



ఉత్కళ్ దివస్‌లో పాల్గొన్న ప్రముఖులు

బీచ్ రోడ్డు: ఒడిశా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఉత్కళ్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దసపల్లా హిల్స్‌లోని ప్రాంగణంలో వేడుకలు జరిపారు. 1936 ఏప్రిల్ 1న భాషా ప్రాతిపదికన ఒడిశా రాష్ట్రం ఏర్పాటు జరిగిన సందర్భాన్ని పురస్కరించుకుని ఒడిశా వాసులంతా ఈ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఒడియా ఫుడ్ ఫెస్టివల్, హ్యాండ్లూమ్ ఫెస్టివల్‌ను కేంద్ర ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ డాక్టర్ రాజేంద్ర కుమార్ ప్రారంభించారు. ఒడిశా ప్రత్యేక వంటకాలైన కాకర, చెనాపోడా, దహిబారా, గుగుని, మాల్పువా వంటివి ప్రదర్శించారు. సంప్రదాయ చేనేత ఉత్పత్తులను తిలకించి ప్రశంసించారు. ఒడిశా ప్రాంత ప్రముఖులైన మధుసూదన్ దాస్, గోపబంధు దాస్, కృష్ణ చంద్ర గజపతి మహారాజ్ వంటి వ్యక్తులకు ఈ సందర్భంగా నివాళులర్పించారు. తూర్పు కోస్తా రైల్వే అదనపు డివిజనల్ మేనేజర్ మనోజ్ కుమార్ సాహు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఆర్ సాహు సంకలనం చేసిన సాహిత్య వార్షిక పత్రిక 'సమాజ్ అరుణియా'ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉత్కళ్ సమాజ్ ప్రధాన కార్యదర్శి బిమల్ కుమార్ మహంత, సమాజ్ అధ్యక్షుడు జితేంద్ర నాయక్ పాల్గొన్నారు.

కంచరపాలెం రైతుబజారు సమాచారం...	
రైతుబజారు విస్తీర్ణం	సుమారు 1.5 ఎకరాలు
గుర్తింపు పొందిన రైతులు	210
ప్రతిరోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు.. తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు	
ప్రతి మంగళవారం సెలవు	
సీసీ కెమెరాలు	13/16 డీవీఆర్
రైతుబజారులో స్టాల్స్	114
రైతుల సంఖ్య	190
ఉదయం రైతుల సంఖ్య	118
సాయంత్రం రైతుల సంఖ్య	72
సమాచారం కోసం: జగదీశ్వరరావు, ఎస్టేట్ అధికారి, సెల్ నంబర్	94907 56334

సూపర్.. ఈ రైతుబజార్

- సీసీ కెమెరాల పర్యవేక్షణ
- రోజుకు 3-4 వేల మందికి పైగా రాక
- రైతులే వ్యాపారులు
- నిర్ణీత ధరలకే సరకుల అమ్మకాలు



కూరగాయలు విక్రయిస్తున్న రైతులు



కంచరపాలెం రైతుబజారులో రద్దీ



రైతుబజారు ప్రధాన ద్వారం వద్ద రద్దీ

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజార్ వినియోగదారులతో నిత్యం కళకళలాడుతుంటుంది. జీవీఎంసీ 54వ వార్డు పరిధిలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న బీఆర్‌టీఎస్ రహదారి పరిధిలో ఈ రైతుబజారు ఏర్పాటు చేశారు. 47,48,49,54, 55, 56,57 వార్డుల్లోని ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, జ్ఞానాపురం తదితర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ 3–4 వేల మందికి పైగానే వినియోగదారులు వస్తుంటారు. ఇక్కడ తాజా కూరగాయలతో పాటు, ఇతర నిత్యావసర సరుకులు సైతం విక్రయిస్తుంటారు. రైతులతో పాటు డ్వాక్రా గ్రూప్ మహిళలు ఇక్కడ వ్యాపారం చేస్తున్నారు. పళ్లు, పూల ఉత్పత్తులు కూడా దొరుకుతాయి. గిరిజన, సూపర్ మార్కెట్, డీసీఎంఎస్, విశాఖ డెయిరీ స్టాల్స్ ఏర్పాటు చేసి తక్కువ ధరకే సరుకులు విక్రయిస్తున్నారు.

ధరల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకే..

ఈ మార్కెట్‌కు వచ్చే వినియోగదారులకు కూరగాయలు, నిత్యావసర సరుకులు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. డిమాండ్ ఉన్న రోజుల్లో ఉల్లిపాయలు, టమాటా సబ్సిడీ ధరలకు అందిస్తున్నారు. ఈ రైతుబజారు నిర్వహణ ద్వారా సుమారు రూ.1.85 లక్షల వరకు ఆదాయం వస్తోంది. రైతుబజార్ ఎస్టేట్ అధికారి (ఈవో), అటెండర్, స్కావెంజర్ల వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులు పోనూ ఆదాయం పెద్దగా మిగిలేది ఏమీ ఉండదనే చెప్పాలి. బయటి మార్కెట్లలో కృత్రిమ కొరత, ధరల దోపిడీ వంటి వాటికి వినియోగదారులు గురికాకుండా ఈ రైతుబజారు నిర్వహిస్తున్నారు.

రైతులే వ్యాపారులు..

కంచరపాలెం రైతుబజారులో 190 మంది రైతులున్నారు. వీరిలో సుమారు 160 మందికి పైగా రైతుబజార్‌కు కూరగాయలు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. గుర్తింపు పొందిన రైతులు ఎటువంటి అద్దె చెల్లించాల్సిన అవసరం లేదు. వారు పండించిన పంటను బజార్‌కు తీసుకొచ్చి నేరుగా వారే వినియోగదారులకు విక్రయించుకునేలా ఇక్కడ ఏర్పాట్లు చేశారు. వినియోగదారులకు నాణ్యమైన, సరైన తూకంతో కూరగాయలు అందేలా మార్కెటింగ్ శాఖాధికారులు పర్యవేక్షణ చేస్తుంటారు. చక్కటి పార్కింగ్‌తో వినియోగదారుల రాకపోకలు చేసేందుకు వీలుగా రైతుబజారుకు రెండు ప్రధాన ద్వారాలు ఏర్పాటు చేశారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో..



దొంగతనాలు అరికట్టేందుకు, వినియోగదారులతో వ్యాపారుల నడవడి, వాహనాల పార్కింగ్ పర్యవేక్షణ వంటి వాటి కోసం సీసీ కెమెరాలు వినియోగిస్తున్నారు. చిల్లర దొంగతనాలు జరిగేటప్పుడు సీసీ కెమెరాల వల్ల చక్కటి ఫలితం కలుగుతోంది. రాత్రి సమయంలో రైతులు తెచ్చే కూరగాయల మూటలు గతంలో దొంగిలించేవారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో రైతుబజారుకు భద్రత కల్పించారు.

పార్కింగ్‌కు అడ్డంకిగా కంటైనర్..

గిరిజన ఉత్పత్తుల కోసం ఏర్పాటు చేసిన భారీ కంటైనర్ రైతుబజారులో పార్కింగ్‌కి అడ్డంకిగా మారింది. పార్కింగ్ ప్రాంతంలో కంటైనర్‌ను ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నారు. ఇది ఎక్కువ స్థలం ఆక్రమించడంతో వినియోగదారు, వ్యాపారులకు ఇబ్బందిగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన గిరిజన ఉత్పత్తుల కంటైనర్

తాజా కూరగాయలు దొరుకుతాయి



ఉదయం, సాయంత్రం ఈ రైతుబజారులో తాజా కూరగాయలు దొరుకుతాయి. అధికారులు నిర్ణయించిన ధరకే రైతులు కూరగాయలు విక్రయిస్తున్నారు. పట్టీలోని ధరలకే కూరగాయలు లభిస్తున్నాయి. ప్రధాన ద్వారం వద్ద ప్రైవేటు వ్యక్తుల విక్రయాలతో పార్కింగ్‌కు ఇబ్బందిగా ఉంది. దళారుల బెడద లేదు.

– **జ్యోతి**, వినియోగదారులు, సిద్ధార్థనగర్, ఊర్వశి కూడలి

పార్కింగ్ పర్యవేక్షించాలి



రైతుబజారుకు గతంలో పార్కింగ్‌కు కావలసిన స్థలం ఉండేది. గిరిజన ఉత్పత్తుల విక్రయాల కోసం భారీ కంటైనర్ ఏర్పాటు చేశారు. ఇది ఎవరి ప్రయోజనం కోసం ఏర్పాటు చేశారో గాని పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించింది. పార్కింగ్ చేయడానికి వినియోగదారులకు ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు పర్యవేక్షించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి.

– **గంటా నాయుడు**, వినియోగదారుడు, భవానీగార్డెన్స్, మర్రిపాలెం.

మా పంట మేమే విక్రయిస్తున్నాం

ఈ రైతుబజారులో దుకాణాల నిర్వహణకు గుర్తింపు కార్డులు మంజూరు చేశారు. మా పొలంలో పండించిన పంట మేమే తీసుకొచ్చి విక్రయిస్తున్నాం. అన్ని ఖర్చులు పోనూ రోజుకు సుమారు రూ. 900లకు పైనే మిగులుతోంది. గతంలో దళారులకు అమ్ముకోవాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి బాధ లేదు. ఇక్కడి ఏర్పాట్లు బాగున్నాయి. వినియోగదారుల సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల మాకు బేరాలు బాగున్నాయి.

– **దేవి**, రైతు, కంచరపాలెం రైతుబజార్

సౌకర్యాలు కల్పిస్తున్నాం

వినియోగదారుల అవసరాల మేరకు కూరగాయలు, నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. ఇటీవల రైతుబజారులో ధరల పట్టిక నుంచి టాయిలెట్లు, పార్కింగ్, పరిశుభ్రతపై నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం. పచ్చదనం కోసం రైతుబజారులో మొక్కలు నాటుతున్నాం. నిర్ణీత ధరలకు విక్రయించని రైతులపై చర్యలు తీసుకుంటున్నాం. సీసీ కెమెరాల ఏర్పాటుతో రైతులు, వినియోగదారులకు మేలు జరుగుతుంది.

– **జగదీశ్వరరావు**, ఎస్టేట్ అధికారి, కంచరపాలెం రైతుబజార్.

24న కలెక్టరేట్ల వద్ద నిరసన

సిటు, భవన నిర్మాణ కార్మికుల సంఘం



భవన నిర్మాణ కార్మికులతో సమావేశమైన సిటు నాయకులు

సింహాచలం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సిటు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు విమర్శించారు. 98వ వార్డు పరిధి అడవివరంలో మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న పలువురు నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే.. భవన నిర్మాణ కార్మికుల బోర్డును అమల్లోకి తెస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, పది నెలలు గడుస్తున్నా హామీని నిలబెట్టుకోలేదని ఆక్షేపించారు. పెండింగ్‌లో ఉన్న క్లెయింలు ఇస్తామని, మెమోను రద్దు చేస్తామని చెప్పిన హామీ కూడా అమలుకు నోచుకోలేదన్నారు. దీనిపై కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులంతా ఈ నెల 24న కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ నిరసన కార్యక్రమాలను భవన నిర్మాణ కార్మికులంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిటు నాయకులు ముద్దాడ ప్రసాద్, ఎం.రామనాయుడు, ఎం.నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.